1న భజ గోవిందం సంకీర్తనా సంజీవిని

నల్లకుంట: శ్రీ వాణి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 1వ తేదీన భజ గోవిందం సంకీర్తనా సంజీవిని కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మ్యూజిక్ అకాడమీ ప్రిన్సిపాల్ సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మాదాపూర్‌లోని మల్లన్న ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం నల్లకుంట తిలక్‌నగర్‌లోని గంగా గౌరీశ్వర భజన మండలి హాల్‌లో భజ గోవిందం సంకీర్తనా పునశ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీతం విద్యార్థులు సంకీర్తనలు ఆలపిస్తూ అలరించారు.

ఓబీసీ కులగణనపై రాహుల్ గాంధీ హామీపై హర్షం

కాచిగూడ: వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశంలో కులగణన నిర్వహిస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించడం పట్ల అఖిల భారత ఓబీసీ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ హర్షం ప్రకటించారు. శుక్రవారం నారాయణగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జనగణనలో కుల గణన నిర్వహిస్తేనే ఓబీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కులగణన లేనందున ఓబీసీలు అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన కోసం పెరుగుతున్న డిమాండ్‌పై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందని ఆయన ప్రశ్నించారు. ఓబీసీ కుల గణన చేస్తామని హామీ ఇచ్చి, నిర్వహించక మోసానికి గురిచేసిన బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీసీ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దేశంలో సమర్థవంతమైన సంక్షేమ చర్యలు తీసుకోవడానికి జనాభా కులగణన అత్యంత అవసరమని, కుల ప్రాతిపదికన జనాభా గణనకు కట్టుబడి ఉండే పార్టీలకే ఓబీసీల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

రెండో రోజూ అదే జోరు..

- 'ప్రజాపాలన'లో దరఖాస్తుల వెల్లువ
- దరఖాస్తుదారులతో కిటకిటలాడిన కేంద్రాలు
- రెండు రోజులకు 15 వేల దరఖాస్తుల పైనే...
- కేంద్రం ప్రారంభించిన గంటలోనే దరఖాస్తులు ఖాళీ

అంబర్‌పేట: ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తును స్వీకరిస్తుండటంతో అంబర్‌పేట నియోజకవర్గంలో శుక్రవారం రెండో రోజు కూడా ప్రజాపాలన కార్యక్రమం రద్దీగా కొనసాగింది. పేదలు దరఖాస్తు చేసుకోవడానికి ఆయా కేంద్రాల్లో బారులు తీరారు. ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో కేంద్రాల వద్ద దరఖాస్తుదారులు క్యూ కట్టారు. పోలీసులను సైతం వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు కేంద్రాల్లోకి అందుబాటులోకి రాగానే గంటలో దరఖాస్తుల కొరత ఏర్పడుతుంది. ఇక రోజాంతా జిరాక్స్, మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేసి దరఖాస్తులు చేసుకుంటున్నారు.



గోల్నాక డీమార్ట్ ఎదురుగా ప్రజాపాలన కేంద్రంలో బారులు తీరిని ప్రజలను అదుపు చేస్తున్న కానిస్టేబుల్

చేసుకుంటున్నారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో కేంద్రాలన్ని దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్నాయి.

రెండు రోజుల్లో 15,000...

అంబర్‌పేట నియోజకవర్గంలో రెండు రోజుల ప్రజాపాలన కార్యక్రమానికి దాదాపు 15 వేల దరఖాస్తులు వచ్చాయని అధికార యంత్రాంగం పేర్కొంటోంది. తెల్ల రేషన్ కార్డుతోపాటు మిగిలిన 5 గ్యారంటీల కోసం ప్రజలు వెల్లువలా దరఖాస్తులు

అవకాశాన్ని అనరాగా చేసుకొని...

ఆరు గ్యారంటీల ఆశతో పేదలు మీ సేవా కేంద్రాల దారి పడుతున్నారు. చిన్నపాటి మీ సేవ కేంద్రంలో సైతం వందల మంది దరఖాస్తులతో బారులు తీరుతున్నారు. ఇదే అదునుగా మీ సేవా కేంద్రం నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద సమర్పించాల్సిన దరఖాస్తులు ఇక్కడ కూడా లభిస్తుండటంతో దరఖాస్తులు రూ. 20 నుంచి రూ. 30 దాకా వసూలు చేస్తున్నారు. కొన్ని మీసేవా కేంద్రాల ముందు బయట టేబులు వేసుకొని అవి నింపడానికి కూడా పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్క రూపాయి ఉన్న జిరాక్స్ కాపీ తాజాగా రూ. 3 తీసుకుంటున్నారు. దీంతో పేదల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

మహిళలకు తప్పని ఇబ్బందులు



మోతీలాల్ నెహ్రూనగర్ ప్రజాపాలన కేంద్రం వద్ద

కాచిగూడ: మోతీలాల్ నెహ్రూనగర్ బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద దరఖాస్తులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు కేంద్రానికి వచ్చి నిరాశగా తిరిగి వెళ్లారు. కొంత మంది జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీశారు. మహిళలకు, పురుషులకు ఒకే లైన్ ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా లైన్లు ఏర్పాటు చేయాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

దరఖాస్తుల పంపిణీలో అధికారులు విఫలం

కవాడిగూడ: ఆరు గ్యారంటీల అమలే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలనలో దరఖాస్తులను ప్రజలకు అందించే విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని దోమలగూడ మాజీ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు టి.రవీందర్ ఆరోపించారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడ వార్డు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... ప్రజలకు సరిపడా దరఖాస్తులను అధికారులు అందించకపోవడంతో జిరాక్స్ సెంటర్ల యజమానులు ఇదే అదునుగా ఒక్కో దరఖాస్తుకు దాదాపు రూ.40 వరకు వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ప్రచార ఆర్భాటంగా ప్రారంభించిన ప్రజాపాలనలో నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక కాలం లేదని ఆయన విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక కాలం ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



దోమలగూడ వార్డు కార్యాలయం వద్ద దరఖాస్తు చూపుతున్న మాజీ కార్పొరేటర్ రవీందర్

ఒక్క రూపాయి ఇవ్వకండి...

నియోజకవర్గంలో ప్రజాపాలన కోసం 24 కేంద్రాలు ఏర్పాటు చేశాం. అన్ని కేంద్రాల వద్ద ఉచితంగా దరఖాస్తులను అందించి ఉచితంగా తీసుకోవడం జరుగుతుంది. దరఖాస్తు పూరించేందుకు సైతం ఆయా కేంద్రాల వద్ద సహాయకులను నియమించారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు సమర్పించవచ్చు.

– మారుతీదివాకర్, డీఎంసీ

జనవరి 3ను మహిళా టీచర్స్‌డేగా ప్రకటించాలి



కొండూరు సత్యనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సావిత్రీబాయి పూలే జయంతి అయిన జనవరి 3ను మహిళా టీచర్స్ డేగా గుర్తించి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీలకు శుక్రవారం ఆయన లేఖ రాశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ... భారత దేశ చరిత్రలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలైన చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా టీచర్స్‌డేగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిరావుపూలేతో కలిసి ఎంతో మంది అనాథలైన వితంతు మహిళలకు వివాహం చేసిందని వివక్షతకు గురైన స్త్రీలను చేరదీసి ఆశ్రమం నడిపిన వీరవనిత సావిత్రీబాయి పూలే అన్నారు. సావిత్రీబాయి 193వ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట డివిజన్ సత్యానగర్ బస్తీ కమ్యూనిటీ హాల్ రెండో అంతస్తు నిర్మాణం కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన ఎంపీ బడ్జెట్ నుంచి రూ. 25.50 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి కమ్యూనిటీ హాల్ రెండో అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బస్తీ పెద్దలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మూసారాంబాగ్ బ్రిడ్జ్ డిజైన్ మార్చాలని వినతి

అంబర్‌పేట: మూసారంబాగ్ బ్రిడ్జి నిర్మాణంతో పరిసర ప్రాంతాల వారి ఆస్తులకు నష్టం ఏర్పడకుండా చూడాలని పలువురు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను కోరారు. దీంతో ఎమ్మెల్యే శుక్రవారం బ్రిడ్జ్ పరిసరాలను బాధితులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జ్ నిర్మాణం కోసం ప్రాతిపదించిన ప్రణాళికతో పరిసరాల్లో ఉన్న 75 శాతం ఆస్తులు కోల్పోతామని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిపాదిత బ్రిడ్జ్ డిజైన్ మార్చాలని పలువురు కోరారు. ఉన్నా డిజైన్‌తో బ్రిడ్జ నిర్మాణం చేపట్టి పరిసరా ప్రాంతాల్లో ఉన్న వారు శాశ్వతంగా జీవనోపాధి కోల్పోతామని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

దరఖాస్తుదారులను ఇబ్బందిపెట్టొద్దు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ముషీరాబాద్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అభయ హస్తం పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురి చేయవద్దని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని బహదూర్‌యార్ జంజగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభయ హస్తం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాంతాల వారీగా వెళ్లాలంటూ అధికారులు దరఖాస్తుదారును తిప్పుతున్నారని ఆరోపించారు. ఇది పద్ధతి కాదని, దరఖాస్తు చేసుకునే మహిళలు అభయహస్తం కేంద్రాల చుట్టూ తిరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అడ్రస్ ఎక్కడ ఉన్నా తప్పనిసరి దరఖాస్తులను తీసుకొని వారికి రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ప్రజలకు కావాల్సిన దరఖాస్తులను అందుబాటులో ఉంచి దళారుల బెడద తప్పించాలని డిమాండ్ చేశారు. అభయహస్తం కేంద్రంలో మరి కొంత మంది సిబ్బందిని పెంచి గంటల తరబడి లైన్‌లో నిలబడకుండా త్వరితగతిన దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఎం.డి. షాహెద్, జావీద్‌ఖాన్, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్‌రావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకు పాఠశాలలు, కళాశాలలు ప్రయోగశాలలుగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ కోయ వెంకటేశ్వర్‌రావు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సెయింట్ ఆడమ్స్ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ఈ సందర్భంగా సోలార్ ఎనర్జీ, చంద్రయాన్, ఆదిత్య ఎల్–1లతో పాటు వివిధ సబ్జెక్టులలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కోయ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... విద్యార్థులకు పాఠశాల నుంచే సైన్స్ పట్ల మక్కువను కల్పించాలని సూచించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, న్యూ ఎరా కళాశాల ప్రిన్సిపాల్, సెయింట్ ఆడమ్స్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, ప్లానటరీ సొసైటీ అధ్యక్షుడు రఘునందన్, ముషీరాబాద్ మండల డిప్యూటీ ఈవో చిరంజీవి, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవర్ష, ఇన్‌చార్జి విజయ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వెంటనే కమిటీ వేయాలని కోరారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించి వారి అభ్యున్నతికి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. 250 గజాల ఇంటి స్థలాన్ని నిరుపేద ఉద్యమకారులందరికీ ఇవ్వాలని, ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని, ఉద్యమకారులకు పెన్షన్ సౌకర్యం, ఉచిత బస్సు పాస్, ఆరోగ్య శ్రీ కార్డు, పది లక్షల జీవిత భీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఉద్యమకారులందరిని ప్రభుత్వం గౌరవించాలని, నిరుద్యోగ ఉద్యమకారులకు 50 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కేటాయించాలని, జర్నలిస్టు ఉద్యమకారులకు జర్నలిస్టు కాలనీ ఏర్పాటు చేసి గృహాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉద్యమకారులందరు అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, కరుణాకర్‌రెడ్డి, ఓరుగంటి ఆనంద్, జ్యోతిరెడ్డి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



అంబర్‌పేట: పేదలకు చేయూతనిచ్చేందుకు తమ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుంటుందని దుర్గాబాయి దేశ్‌ముఖ్ (డీడీ) కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. కాలనీలోని పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. డాక్టర్ గౌతమ్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రసన్న పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

చిక్కడపల్లి: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని అరుంధతీనగర్‌లో నెలకొన్న మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ ఎ.పావనికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డికి సమాచారమిచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అరుంధతీనగర్‌కు చేరుకున్న ఆయన సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

దామోదర రాజనర్సింహకు సన్మానం



ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర యువసేన అధ్యక్షుడు నవీన్ రాజ్ శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువాలు కప్పి పూలబొకే అందజేసి సన్మానించారు

మాదిగలను వంచిస్తున్న బీజేపీ: వంగపల్లి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణపై కమిటీ వేస్తామని చెప్పి కనీసం పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ ప్రస్తావన తీయకుండా కేంద్రంలోని బీజేపీ మాదిగలను వంచిస్తున్నదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ విమర్శించారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి పదేళ్లు కావస్తున్నా వర్గీకరణ అంశం ఊసే ఎత్తడం లేదని, మాదిగలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గతంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణపై అనేక కమిటీలు, కమీషన్‌లు వేసి ఎస్సీ వర్గీకరణ అంశం సామాజిక న్యాయ సూత్రానికి అనుకూలంగానే ఉందని ఎస్సీల్లో ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాలకు జనాభా ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేయాలని చెప్పిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్, హుస్సేన్, గుడ్ల మోహన్‌రావు, పరికాల వెంకన్న, సారంగం, రాజేష్‌కన్నా, నరేందర్, కొల్లూరు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌టీ గ్రౌండ్ కిటకిట

అభయ హస్తం పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం రాంనగర్‌లోని ఎన్‌ఆర్‌టీ గ్రౌండ్‌లో జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఎన్‌ఆర్‌టీ గ్రౌండ్ పూర్తిగా మహిళలతో నిండిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు బారులు తీరి తమ దరఖాస్తులను అందజేశారు.

– ముషీరాబాద్



'అభయ హస్తంపై బీఆర్‌ఎస్‌వి చిల్లర రాజకీయాలు'

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన పేరుతో చేపట్టిన అభయ హస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బీ బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ విమర్శించారు. శుక్రవారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అభయహస్తం దరఖాస్తు లను కాంగ్రెస్ నాయకులు అమ్ముకుంటున్నారని బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళిత బంధు, కల్యాణలక్ష్మి, బీసీ బంధు తదితర పథకాల లబ్ధిదారుల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు దండుకున్న సంస్కృతి బీఆర్‌ఎస్ నేతలదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతారు తప్ప ప్రజల డబ్బు అక్రమంగా దోచుకోరని అన్నారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు మానుకొని ప్రజా పాలన కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. కాంగ్రెస్ సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు స్వప్నాగౌడ్, కాంగ్రెస్ గ్రేటర్ నాయకులు జెనిగె శ్రీనివాస్‌యాదవ్, మురళీమోజెస్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్నం నాగభూషణంగౌడ్

ముషీరాబాద్ మీ–సేవా కేంద్రం వద్ద స్వల్ప ఉద్రిక్తత

ఉదయం మూసివేత.. మధ్యాహ్నం పునఃప్రారంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ మీ సేవా కేంద్రానికి జనం తెల్లవారుజామునుంచే బారులు తీరి ఎగబడటంతో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వివరాలివీ... ప్రజాపాలన అభయ హస్తం దరఖాస్తులకు జతపర్చాల్సిన సర్టిఫికెట్లు, ఆధార్ అప్‌డేట్ కోసం తదితర అవసరాల నిమిత్తం ముషీరాబాద్ మీ సేవా కేంద్రానికి తెల్లవారుజాము 4 గంటల నుంచే మహిళలు బారులు తీరి నిలుచున్నారు. మీ సేవా సిబ్బంది ఉదయం 8.30 గంటలకు వచ్చి 60 మందికి ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు టోకెన్‌లు ఇచ్చారు. టోకెన్‌లు అందనివారు, ఇతర అవసరాల కోసం మీసేవా కేంద్రానికి వచ్చిన మహిళలు మీసేవా కేంద్రంలోకి చొచ్చుకొని వచ్చేందుకు ప్రయత్నించడంతో సిబ్బంది వారిని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మీ సేవా ఇన్‌చార్జి ఫిరోజ్ చేతివేళ్లకు తీవ్ర గాయం అయింది. జనం ఒత్తిడిని తట్టుకోలేక మీసేవా కేంద్రాన్ని ఉదయం 10.30 గంటలకే మూసివేసి వెళ్లిపోయారు. అయినా ప్రజలు మీసేవా ముందే బారులు తీరి మీ సేవా కార్యాలయం మళ్లీ తెరుస్తారేమో అని వేచి ఉన్నారు. చివరకు మధ్యాహ్నం 3 గంటల అనంతరం మీసేవా కేంద్రాన్ని తెరిచి విధులు నిర్వహించారు.



మీ–సేవా కార్యాలయం వద్ద వేచి చూస్తున్న మహిళలు

దర్శకుడు శివనాగుకు నటి జమున పురస్కారం



పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

చిక్కడపల్లి: ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి త్యాగరాయ గానసభలో 2023లో మరణించిన సినీ ప్రముఖుల నివాళి కార్యక్రమం జరిగింది. జమున, విశ్వనాథ్, సాగర్, వాణీజయరాం, తారకరత్న, శరత్‌బాబు ఇలా 22 మందిని స్మరిస్తూ జరిగిన కార్యక్రమంలో సుబ్బిరెడ్డి డాక్టర్ నాగేశ్వర్‌రావు, రజన, నర్మద తదితరులు వారి చిత్రాలలోని పాటలను గానం చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ నేత షేక్ పర్వేజ్, మాజీ పోలీస్ అధికారి సుంకర సత్యనారాయణ సినీ దర్శకులు శివనాగుకు జమున సార్మక పురస్కారాన్ని ప్రదానం చేశారు. కళాపోషకుడు వైఎస్‌ఆర్ మూర్తి, మరకత లింగస్వామి భక్తాగ్రేసరుడు దయాకర్ స్వామి పాల్గొనగా సంస్థ అధ్యక్షురాలు పుష్పలత స్వాగతం పలికారు.

ఉచిత ప్లాస్టిక్ సర్జరీ వైద్యం కోసం...

అంబర్‌పేట్: గ్రహణం మొర్రి, కాలిన గాయాలతో అవయవాల వంకరలను సరిచేయడం, జన్యుపర లోపంతో శరీరంపై విపరీతంగా వెంట్రుకల పెరుగుదల నివారణకు ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంపును నిర్వహించనున్నారు. జనవరి 22 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు 15 రోజుల పాటు ప్లాస్టిక్ సర్జరీ క్యాంపును నిర్వహిస్తున్నారు. శనివారం నుంచి తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు, రాంకీ ఫౌండేషన్ చైర్మన్ మువ్వ రాంరెడ్డి, గ్రీన్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు విద్యాభూషణ్, డాక్టర్ గులాబీ రాణీ, పురావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ప్రతినిధి గద్దె భాస్కర్ పేర్కొన్నారు. ఉచిత ప్లాస్టిక్ సర్జరీ క్యాంపు అమెరికాకు చెందిన వైద్యుల బృందంచే నిర్వహిస్తారన్నారు. సీతారాంబాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ ట్రస్టు ఆస్పత్రిలో నిర్వహిస్తారన్నారు. వివరాలకు ఫోన్స్: 78160 79234, 98482 41640.

విద్యార్థులకు ముత్తూట్ ఫైనాన్స్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్స్ పంపిణీ చేసిన జోనల్ మేనేజర్ జితేందర్ కుమార్

కాచిగూడ: ముత్తూట్ గ్రూప్ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసిస్తున్న నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులకు ముత్తూట్ ఎం జార్జ్ హయ్యర్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్‌లను ఆ సంస్థ జోనల్ మేనేజర్ జితేందర్ కుమార్ అందజేశారు. హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్ ఫైనాన్స్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంబిబిఎస్ విద్యార్థులకు రూ. 2,40,000, బీటెక్ విద్యార్థులకు రూ. 1,20,000 అందజేశారు. హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ, సైబరాబాద్ రీజియన్ మేనేజర్ కె.వి.మురళి, సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ గోలి రోజా, సీఎస్‌ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ యమగాని పాల్గొన్నారు.

తల్లీ ముగ్గురు పిల్లల అదృశ్యం



చిక్కడపల్లి: తల్లీముగ్గురు పిల్లలు అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య సమాచారం మేరకు... చిక్కడపల్లి సంజయ్‌నగర్‌కు చెందిన ఎస్.సాయికృష్ణ, ఎస్.సునీత(36) భార్యాభర్తలు. వారికి ముగ్గురు పిల్లలు ఎస్.చైత్ర(10), ఎస్.త్రిలోచన(9), మానిష్(6) ఉన్నారు. పిల్లలు ముగ్గురు బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ స్కూల్‌లో చదువుతున్నారు. సాయికృష్ణ నిరుద్యోగి సునీత ప్రైవేట్ ప్రెస్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 5వ తేదీన సాయంత్రం దంపతులు చిన్న విషయంలో గొడవపడ్డారు. 6వ తేదీన ఉదయం చూసేసరికి సునీత తన ముగ్గురు పిల్లలతో అదృశ్యమయ్యారు. వారి కోసం వెతికి చివరకు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కోటేశ్వర్‌రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోటాపోటీగా హరినగర్ బస్తీ అధ్యక్ష ఎన్నికల ప్రచారం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దక్షిణ భారత సేవా సమాజ్ (హరినగర్ బస్తీ) అధ్యక్ష పదవి కోసం జరిగే ఎన్నికలు రాంనగర్‌లో కాకరేపుతున్నాయి. అధ్యక్ష పదవిని గెలుచుకోవడం కోసం పోటీపడ్డ ముగ్గురు తీవ్రంగా ప్రయత్నిస్తు ఇంటింటికీ తిరుగుతూ సభలు, సమావేశాలు నిర్వహించడం చర్చనీయంశంగా మారింది. గతంలో ఏకగ్రీవంగా జరిగిన ఎన్నికలు అనేక సంవత్సరాల తరువాత ఎన్నికలకు దారి తీయడంతో ఎవరికి వారు గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఎన్నికల్లో గడియారం గుర్తుపై గజ్జల సూర్యనారాయణ, ఫుట్‌బాల్ గుర్తుపై నేరెళ్ల కుషాల్‌కుమార్, కప్పు సాసర్ గుర్తుపై బీవనపల్లి రమేష్‌లు బరిలో ఉన్నారు. దీనికి ఎన్నికల పరిశీలకులుగా కేశవపురం స్వామి, జి.రుషికేశ్వర్‌రావు, గడ్డం బాలకృష్ణ, నేరేళ్ల బాలయ్య, దార్ల రఘులు వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేసే వారు 18 సంవత్సరాలు నిండి సొంత ఇళ్లు కలిగిన బస్తీ వాసులందరు అర్హులని ప్రకటించారు. ఎన్నికల అనంతరం సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

నాకు ఓటు వేసి గెలిపించండి–బీవనపల్లి రమేష్.

దక్షిణ భారత సేవ సమాజ్(హరినగర్) అధ్యక్ష పదవీ కోసం జరుగుతున్న ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నాని సిరియల్ నెంబర్ 2లో ఉన్న కప్పు సాసర్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని బీవనపల్లి రమేష్ బస్తీ వాసులకు విజ్ఞప్తి చేశారు. తనను గెలిపిస్తే బస్తీని అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తానని, కనీస సౌకర్యాలు మెరుగు పరుస్తానని హామీ ఇచ్చారు.